నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 కరీంనగర్, మంగళవారం 16 జూలై 2024 KARIMNAGAR

## కదిలిన కరెంట్ అధికారులు

నమస్తే ఎఫెక్ట్

గంగాధర,జూలై 15: గంగాధర మండలంలో తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురించింది. ఈ నెల 7న 'నెల రోజులు.. 72 ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు', ఈ నెల 12న 'ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య పట్టదా..?' శీర్షికన రైతులు పడుతున్న బాధలను కండ్లగట్టింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం లింగంపల్లి, నాగిరెడ్డిపూర్, వెంకంపల్లి, బూరుగుపల్లి, ర్యాలపల్లి గ్రామాల్లో పర్యటించారు. బూరుగుపల్లిలో ఎస్‌ఎస్-6, ర్యాలపల్లిలో ఎస్ఎస్-1, నాగిరెడ్డిపూర్‌లో ఎస్ఎస్-99, వెంకంపల్లిలో ఎస్ఎస్-22 ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేశారు. స్థానిక రైతులు, ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి? ఎన్ని రోజుల్లో మరమ్మతులు చేసి బిగించారు? వంటి వివరాలను నమోదు చేసుకున్నారు. నివేదికను తయారు చేసి పై అధికారులకు పంపిస్తామని విద్యుత్ శాఖ డీఈ విజయేందర్‌రెడ్డి తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, సమస్యలను తమకు దష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

## అబార్షన్లపై పోస్టుమార్టం

'నమస్తే' వరుస కథనాలతో కలకలం



### కలెక్టర్ సీరియస్.. కదులుతున్న యంత్రాంగం

- హుజూరాబాద్ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్‌కు డీఎంహెచ్‌వో నోటీస్
- వైద్యారోగ్యశాఖకు అందిన నివేదిక
- ఇద్దరు మహిళా డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నట్టు వెల్లడి
- లోతుగా వెళ్తారా..? లేకుంటే ఒత్తిడికి తలొగ్గుతారా..? అనే సందేహాలు
- నిగ్గు తేల్చితేనే భ్రూణహత్యలకు అడ్డుకట్ట

జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా సాగుతున్న అబార్షన్ల రాకెట్‌పై పోస్ట్‌మార్టం కొనసాగుతున్నది. భ్రూణహత్యలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురించగా, యంత్రాంగం కదులుతున్నది. ప్రభుత్వంతోపాటు కలెక్టర్ పమేలా సత్పతి సీరియస్ కావడంతో డీఎంహెచ్‌వో సుజాత రంగంలోకి దిగి, ఇప్పటికే హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్‌హోంను సీజ్ చేయడంతోపాటు రిజిస్ట్రేషన్ రద్దు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలోనే 'అబార్షన్ల రాకెట్‌లో ఆ ఇద్దరు మహిళా డాక్టర్లే కీలకం!' అనే శీర్షికన ఈ నెల 12న కథనం ప్రచురితం కావడం కలకలం రేపింది. హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లే సూత్రధారులన్న విషయాన్ని బహిర్గతం చేయగా, ఈ కథనం సంచలనం సృష్టించింది. కలెక్టర్ ఆదేశాలతో హుజూరాబాద్ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్‌కు డీఎంహెచ్‌వో నోటీస్ జారీ చేయడంతోపాటు పూర్తి వివరణ కోరారు. ఆ మేరకు సూపరింటెండెంట్ పూర్తి నివేదికను సమర్పించగా.. అందులో పూర్తి స్థాయిలో నిజానిజాలను పొందపరచలేదని తెలుస్తున్నది. అయితే మరింత లోతుగా వెళ్తేనే రాకెట్‌కు అడ్డుకట్ట పడనున్నది.

కరీంనగర్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా సాగుతున్న అబార్షన్లు, అందుకు ఉపయోగిస్తున్న డ్రగ్స్, ప్రధానపాత్ర పోషిస్తున్న పలు దవాఖానలు, పాత్రదారులు, సూత్రదారులు వంటి వివరాలతో 'నమస్తే తెలంగాణ' నాలుగు రోజుల పాటు వరుస కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. ఆ మేరకు ముందుగా హుస్నాబాద్ పోలీసులు స్పందించి హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్ నిర్వాహకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం కూడా విదితమే. హుస్నాబాద్ పోలీసులు స్పందిస్తున్నా జిల్లా వైద్యారోగ్యశాఖ మొద్దు నిద్ర పోతున్న విషయాన్ని సైతం 'నమస్తే' వెలుగులోకి తేవడంతో ఈ వ్యవహారంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. దీంతో డీఎంహెచ్‌వో స్పందించి, ఎట్టకేలకు కార్యాలయం నుంచి కదిలారు. ఈ నెల 12న కలెక్టర్ ఆదేశాలతో హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్‌హోంను సీజ్ చేయడంతోపాటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇదే సమయంలో 'అబార్షన్ల రాకెట్‌లో ఆ ఇద్దరు మహిళా డాక్టర్లే కీలకం' శీర్షికన కథనం ప్రచురితం కావడం, అందులో అనేక అంశాలను బయటపెట్టడంతో కలెక్టర్ మరోసారి ఫైర్ అయ్యారు. దీంతో జిల్లా వైద్యాధికారి హుజూరాబాద్ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్‌కు నోటీసు జారీ చేసి.. ఆ ఇద్దరు మహిళా డాక్టర్లపై పూర్తి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు.

### వైద్యారోగ్యశాఖకు నివేదిక

సూపరింటెండెంట్ పూర్తి వివరాలతో వైద్య ఆరోగ్యశాఖకు తాజాగా ఒక నివేదిక సమర్పించారు. హుజూరాబాద్ ఏరియా దవాఖానలో మొత్తం ఐదుగురు గైనకాలజిస్టులు ఉన్నట్టు పేర్కొన్నారు. అందులో వైద్యులు జే సోమశేఖర్, ఎస్ పల్లవి, వైవాణి లత, ఎం లావణ్య, డీ నాగనందిత పనిచేస్తున్నట్టు నివేదిక ఇచ్చారు. డాక్టర్ ఎం లావణ్య, డాక్టర్ డీ నాగనందితకు హుజూరాబాద్, జమ్మికుంటలో ప్రైవేట్ ప్రాక్టీస్ ఉన్నట్టు స్పష్టం చేశారు. గతంలో జిల్లా వైద్యారోగ్యాధికారి జమ్మికుంటలో చేసిన దాడుల్లో లావణ్య చట్టవిరుద్ధంగా అబార్షన్లు చేస్తూ పట్టుబడడంతో సస్పెండ్ అయ్యారని, ప్రస్తుతం అమె సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారని తెలిపారు. ఇక ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నాగనందిత ప్రైవేట్ ప్రాక్టీస్ కలిగి ఉన్నారని, అయితే ఆమె ఇప్పుడు ప్రసూతి సెలవులో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. డాక్టర్లు లావణ్య, నాగనందిత తప్ప ఇతర డాక్టర్లకు ప్రైవేట్ ప్రాక్టిస్‌తో సంబంధం లేదని సూపరింటెండెంట్ తన నివేదికలో స్పష్టం చేశారు.

### నిజం నిగ్గు తేల్చలే?

డీఎంహెచ్‌వోకు నివేదిక సమర్పించిన ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ పూర్తిస్థాయి నిగ్గు తేల్చలేదని తెలుస్తున్నది. నివేదిక అడిగినందుకు ఇచ్చినట్టుగా ఉన్నదే తప్ప.. అందులో పూర్తిస్థాయిలో నిజానిజాలను పొందుపరచలేదని అర్థమవుతున్నది. నిజానికి డివిజన్‌లో అబార్షన్ల రాకెట్ నడుపుతున్నదెవరు? అందులో కీలకపాత్ర పోషిస్తున్న ఆ ఇద్దరు మహిళా డాక్టర్లు ఎవరు? ఎన్నాళ్లుగా ఈ దందా సాగుతున్నది? అన్న వివరాలను సైతం నివేదికలో పొందుపరచలేదని తెలిసింది. అంతేకాదు, తన ఏరియా దవాఖానలో ఐదుగురు గైనకాలజిస్టులు పనిచేస్తున్నారని చెప్పిన సూపరింటెండెంట్.. ఇద్దరు ప్రైవేట్ దవాఖానలు నడుపుతున్నట్టు స్పష్టత ఇచ్చారు. పోనీ ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్న ఆ డాక్టర్స్ అబార్షన్స్ చేస్తున్నారా..? లేదా..? అన్నది స్పష్టత ఇవ్వలేదు. అందులో కొన్ని అధికారాలు సూపరింటెండెంట్‌కు లేకపోవచ్చు కానీ, ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని లోతుగా వెళ్తే.. రాకెట్ నడిపే డాక్టర్ల గురించి పూర్తిగా తెలిసే అవకాశం ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### లోతుగా వెళ్తేనే అడ్డుకట్ట

నివేదిక ఆధారంగా డీఎంహెచ్‌వో విస్తృత చర్యలు తీసుకోవచ్చు. అవసరమైతే ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిజాలను నిగ్గు తేల్చవచ్చు. సూపరింటెండెంట్ తన నివేదికలో ఇద్దరు మహిళా డాక్టర్లు ప్రైవేట్ దవాఖానలు నడుపుతున్నట్టు స్పష్టంగా ఇచ్చిన నేపథ్యంలో డీఎంహెచ్‌వో మరింత ముందుకెళ్లవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. ప్రధానంగా గర్భిణుల జాబితా గ్రామాల వారీగా వైద్య ఆరోగ్య శాఖ చేతిలో ఉంటుంది. వాటి ఆధారంగా విచారణ జరిపినా భ్రూణహత్యలు బయటపడే అవకాశాలుంటాయని వైద్యారోగ్యశాఖ అధికారులే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో నివేదికకే పరిమితమవుతారా..? లేక.. మరింత లోతుగా వెళ్తారా..? అన్నది ముమ్ముందు తేలనున్నది. విచిత్రం ఏమిటంటే అబార్షన్ రాకెట్ నడుపుతున్న ఆ ఇద్దరు మహిళా డాక్టర్ల పేరు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది నుంచి పై స్థాయివరకు తెలిసినా.. వారిపై చర్యలు తీసుకోకుండా దాటవేస్తున్న తీరు అనేక అనుమానాలకు తావిస్తున్నది. దీనినే ఆసరాగా చేస్తున్న సదరు మహిళా డాక్టర్లు.. విచ్చలవిడిగా అబార్షన్లు చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రాకెట్‌కు అడ్డుకట్ట వేయాలంటే మరింత లోతుగా వెళ్లాల్సిన అవసరముందని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడుతున్నారు.



### నొప్పులకు గోలీలు ఇవ్వలేదు

కొన్ని నెలల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న. డాక్టర్లు నన్ను పరీక్షించి, ఎక్స్‌రేలు తీసిన్రు. వరంగల్‌కు పోవాలని చెప్పిన్రు. నొప్పులు తగ్గడానికి మందులు రాసినా ఇక్కడ ఒక్క గోలీ లేదని, బయట కొనుక్కోవాలని అంటున్నరు. ఎంతో దూరం నుంచి ఇక్కడికి వస్తే మళ్లీ వరంగల్‌కు వెళ్లాంటున్రు. ప్రైవేట్ దవాఖాన్లకు పోతే పరీక్షలు, మందులకు వేలు ఖర్చయితున్నయి. అధికారులు అన్ని రకాల పరీక్షలు, మందులు అందుబాటులో పెడితే మాలాంటి పేదోళ్లకు సాయంగా ఉంటుంది.

- రాములమ్మ, పెద్దాపూర్



జీజీహెచ్‌లో మందుల కోసం బారులు తీరిన రోగులు

# సరారు దవాఖానల్లో మందుల్లేవ్

## సీజనల్ వ్యాధుల వేళ వేధిస్తున్న కొరత

- అంతటా అంతంతే మెడిసిన్
- జలుబు, జ్వరానికి ఒకటే మందు బిల్ల
- అన్నీ ఉన్నాయంటున్న వైద్యులు
- రెండు గోలిలే ఇస్తున్నారంటున్న రోగులు
- కరీంనగర్‌లోని టీ హబ్‌లో కొన్నింటికే పరీక్షలు
- ఇప్పటికే పెరుగుతున్న డెంగీ కేసులు
- ఆందోళనలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు



మందులు ఇస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధుల వేళ సర్కారు దవాఖానలకు నిర్లక్ష్యపు రోగం పట్టుకున్నది. డెంగీ, విషజ్వరాలు, ఇతర రోగాలు ప్రబలుతున్న తరుణంలో మందుల కొరత భయపెడుతున్నది. జలుబు చేసినా, జ్వరం వచ్చినా ఒకటే మందు బిల్ల చేతిలో పెట్టి పంపుతుండడం కలవరపెడుతున్నది. దాదాపు 45 రోజులుగా జిల్లాలోని ఏ వైద్యశాలకు వెళ్లినా ఇలాంటి దుస్థితే ఉంటున్నది. మరోవైపు డెంగీ పాజిటివ్ కేసులు కూడా విపరీతంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. రోగులు చేసేదేం లేక తప్పనసరి పరిస్థితిలో ప్రైవేట్ వైద్యం కోసం పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడగా, పేద, మధ్యతరగతి వర్గాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తున్నది.



### వాపు తగ్గే మందులు లేవన్నరు

మా అమ్మకు కుక్క కరిచింది. కరీంనగర్‌లోని దవాఖానలో ఇంజెక్షన్ ఇచ్చారు. అనంతరం మందులు రాసినా అందులో పూర్తిగా ఇవ్వలేదు. లేవన్నరు. మళ్లీ గాయం ఎక్కువై వాపు ఉండడంతో వైద్యులు మరిన్ని మందులు రాశారు. డిస్పెన్సరీలో వాపు తగ్గే మందు లేదని చెప్పారు. దీనిని బయట కొనుక్కున్నాం.

- రవీంద్రాచారి, జీలకుంట



కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన వార్డులో జ్వర పీడితులు

కరీంనగర్, జూలై 15 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్: కరీంనగర్ జిల్లాలో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 6 అర్బన్ హెల్త్ సెంటర్లు, 139 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, నాలుగు బస్తీ దవాఖానలు ఉన్నాయి. వీటికి తోడు జిల్లా కేంద్రంలో ఒక ప్రభుత్వ జనరల్ దవాఖాన, హుజూరాబాద్‌లో ఒక ఏరియా దవాఖాన, జమ్మికుంటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉన్నాయి. సగటున ఒక రోజుకు ప్రభుత్వ జనరల్ దవాఖానలో వెయ్యి, హుజూరాబాద్ ఏరియా దవాఖానలో 400, పీహెచ్‌సీల్లో 100, యూపీహెచ్‌సీల్లో 70, జమ్మికుంట సీహెచ్‌సీలో 200, బస్తీ దవాఖానల్లో 60 మంది చొప్పున రోగులు వైద్యం కోసం వస్తున్నారు. ఈ మొత్తం దవాఖానల్లో రోజుకు సగటున 8 వేలకు పైగా రోగులకు ఓపీ చూస్తున్నారు. దవాఖానలో ఒంటి నొప్పులు, దగ్గు, జలుబు, జ్వరాలతో వచ్చే వాళ్లే ఎక్కువగా ఉంటారు. ఈ లక్షణాలు సీజనల్ వ్యాధులకు దారి తీస్తున్నాయి. అయితే ఇలాంటి రోగులకు ముందుగానే మంచి మందులు ఇస్తే సీజనల్ వ్యాధులను ఆదిలోనే అరికట్టే అవకాశాలున్నాయి. కానీ ప్రభుత్వ దవాఖానల్లో ఇలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.

### అందుబాటులో లేని మందులు.

సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులో లేక రోగులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా దగ్గు, జలుబుతో బాధపడుతూ వచ్చే రోగులకు సీపీఎం ట్యాబ్‌లెట్, సిరప్ ఇస్తారు. కానీ, గత 45 రోజులుగా పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఈ మందులు అందుబాటులో లేవు. అంతే కాకుండా యాంటిబయాటిక్‌గా ఇచ్చే అజిత్రోమైసిన్ కూడా అందుబాటులో లేదు. యాంటిబయాటిక్ వాడినప్పుడు కడుపులో మంట రాకుండా ఇచ్చే ప్యాంటప్ ట్యాబ్‌లెట్స్, నొప్పుల కోసం డైక్లో, బీపీ కోసం టెల్మా వంటి మందులు 45 రోజులుగా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్‌లోనే లేకుండా పోయాయి. వైద్యులు మాత్రం అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పుకొస్తున్నారు. నిజానికి ఈ మందులు ఏ పీహెచ్‌సీలో కూడా అందుబాటులో లేవని స్పష్టమవుతున్నది. కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు పాత స్టాక్‌తో నెట్టుకొస్తున్నట్టు తెలుస్తున్నది. చాలా పీహెచ్‌సీల్లో జలుబు, దగ్గు, జ్వరానికి పారాసిటమాల్ ఒక్కటే చేతిలో పెట్టి పంపిస్తున్నారు. నొప్పులతో బాధపడుతూ వచ్చే రోగులకు కూడా సంబంధిత మందులు అందుబాటులో లేవు. అనేక పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో మానసిక రోగులకు అవసరమైన మందులు లేవు. మరో పక్క డెంగీ జ్వరాలు జిల్లాను భయపెడుతున్నాయి. కేవలం ప్రభుత్వ దవాఖానలో నిర్వహించిన పరీక్షల్లో 15 రోజులుగా రోజుకు సగటున 2 చొప్పున 30 కేసులు నమోదయ్యాయి. ఇలాంటి రోగులకు సరైన వైద్యం అందించాలంటే పూర్తి స్థాయిలో మందులు అవసరం ఉంటాయి. కానీ, అనేక చోట్ల సీజనల్ వ్యాధులకు అవసరమైన పూర్తి స్థాయి మందులు లేక పోవడంతో రోగులు ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు. వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తున్నది.

### పడకేసిన టీ హబ్ సేవలు

కేసీఆర్ సర్కారు హయాంలో కరీంనగర్ జనరల్ ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన టీ హబ్‌లో పది రోజులుగా పలు సేవలు నిలిచి పోయాయి. ఈ సెంటర్‌కు వివిధ పీహెచ్‌సీల పరిధిలో రోగుల నుంచి సేకరించి తెచ్చిన రక్త, మూత్ర పరీక్షలు పూర్తిగా నిలిపివేశారు. కేంద్రంలోని కొన్ని ఎక్విప్‌మెంట్ పనిచేయక పోవడంతో ఈ పరిస్థితి వచ్చినట్టు తెలుస్తున్నది. రోగ నిర్ధారణ పరీక్షలు ముఖ్యంగా సీబీపీ, ఎల్‌ఎఫ్‌టీ, ఆర్‌ఎఫ్‌టీ పరీక్షలు నిర్వహించడం వల్ల పేద రోగులకు ఎంతో వెసులుబాటు ఉండేది. టీ హబ్‌లో ప్రస్తుతం కేవలం థైరాయిడ్‌కు సంబంధించిన పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. మిగతా పరీక్షలన్నింటికీ పది రోజులుగా అటకెక్కించారు.



### నాలుగు రాస్తే ఒక్కటే ఇచ్చిన్రు

జ్వరం, తల తిప్పుతుందని దవాఖానకు వస్తే డాక్టర్ నాలుగు రకాల మందులు రాసిండు. ఇక్కడికి వస్తే ఒక్కటే రకం గోళీలు ఉన్నాయని, మిగితావి బయట కొనుక్కోవాలని అంటున్నరు. అధికారులేమో దవాఖానలో అన్ని పరీక్షలు చేస్తరు, మందులు ఉన్నయని అంటుంటే ఇక్కడ మాత్రం ఏం లేదు. రొటీన్‌గా ఉండే మందులు కూడా దొరుకుతలేవు. పూర్తి స్థాయిలో మందులను అందుబాటులోకి తేవాలి.

- రిజ్వానా, కరీంనగర్



మందుల కోసం బారులు తీరిన రోగులు



### థైరాయిడ్ మందుల్లేవు

నా కూతురు అనారోగ్యంతో ఉండడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానకు తీసుకెళ్లిన. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి థైరాయిడ్ ఉన్నట్టు గుర్తించిన్రు. రెండు నెలలకు సరిపడా మందులు ఇచ్చిన్రు. అవి ఇప్పుడు అయిపోయినయి. సుల్తానాబాద్, కరీంనగర్ ప్రభుత్వ దవాఖానల్లో తిరిగితే థైరాయిడ్ మాత్రలు దొరకవని, బయట కొనుక్కోవాలని సమాధానం చెబుతున్నరు. మాలాంటి పేదోళ్లకు ఇలాంటి మందులు బయట కొనుగోలు చేయాలంటే ఇబ్బందే కదా. - గడ్డం రాజు, సుల్తానాబాద్



### స్కానింగ్ చేసిన్రు.. మాత్రలు ఇవ్వలే

కడుపునొప్పిగా ఉందని కరీంనగర్ దవాఖానకు వచ్చిన. వైద్యులు స్కానింగ్ చేసి మందులు రాసిన్రు. నడుంనొప్పి, కడుపు నొప్పికి నాలుగు రకాల మాత్రలు రాసినా ఒక్కటే మాత్ర ఇచ్చి మిగితావి అందుబాటులో లేవని అన్నరు. జ్వరాలకు, నొప్పులకే మాత్రలు లేకపోతే ఇంకా దేనికి ఉంటయి. మాలాంటోళ్లకు ప్రభుత్వ దవాఖానల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలి.

- లత, కరీంనగర్

## అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కరీంనగర్ తెలంగాణచౌక్/ జగిత్యాల, జూలై 15: గురుపౌర్ణమిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం కరీంనగర్ రీజియన్‌లోని కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని నుంచి తమిళనాడులోని అరుణాచలం దేవస్థానానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడిపిస్తున్నామని ఆర్‌ఎం సుచరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న శుక్రవారం రాత్రి గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి కరీంనగర్‌కు చేరుకుంటుందని, మరో బస్సు జగిత్యాల నుంచి బయలుదేరుతుందని చెప్పారు. మార్గం మధ్యలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, వేలూర్ దర్శనం చేసుకొని, 20న శనివారం రాత్రి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షణ, దర్శనం అనంతరం తిరుగుపయనంలో 21న సాయంత్రం అరుణాచలం నుంచి బయలుదేరి 22న ఉదయం జోగులాంబ దేవస్థానానికి వెళ్తుందని చెప్పారు. అక్కడ దర్శనం అనంతరం రాత్రి వరకు ఇటు కరీంనగర్ మీదుగా గోదావరిఖని, మరో బస్సు జగిత్యాలకు చేరుకుంటుందని వివరించారు. ఈ ప్రత్యేక బస్సుకు గోదావరిఖని నుంచి పెద్దలకు ₹4,850, పిల్లలకు ₹4,050, కరీంనగర్ నుంచి పెద్దలకు ₹4500, పిల్లలకు ₹3800 చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. జగిత్యాల నుంచి ఒక్కొక్కరికీ ₹4600 చార్జి ఉంటుందని డిపో మేనేజర్ జీ సునీత తెలిపారు. టీజీఆర్టీసీ ఆన్‌లైన్‌లో ముందస్తు టికెట్లను బుకింగ్ చేసుకోనే అవకాశం ఉందని వివరించారు.



పోచమ్మవాడలో ట్యాంక్, పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష

## ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూలై 15: మంథని నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథని పట్టణవాసులకు తాగునీరందించేందుకు ₹12.10 కోట్లతో అమృత్ 2.0 కింద స్థానిక పోచమ్మవాడలో వాటర్ ట్యాంక్, పైపులైన్ నిర్మాణ పనులకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక గురుకుల విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ₹4కోట్లతో పట్టణంలో అధునాతన వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను నిర్మిస్తామని చెప్పారు. పట్టణాభివృద్ధికి అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని చెప్పారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని సూచించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

కమాన్‌చౌరస్తా, జూలై 15: భవిష్యత్ తరాల మేలు కోసం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కరీంనగర్ జిల్లాకేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నదని చెప్పారు. ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలని, గ్రామాలు, పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటించి సంరక్షణపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్, ఆర్డీవో కే మహేశ్వర్, డీఆర్డీవో శ్రీధర్, డీఎఫ్‌వో బాలమణి, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో ప్రభు, కార్పొరేటర్లు ఉన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవి విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571